

చెడుపై మంచి గెలుపే దసరా

మంత్రి సవిత



ప్రజాశక్తి-పెనుకొండ
చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా జరుపుకుంటున్న దసరా పండగ ప్రజలందరి జీవితాలను సుఖమయం చేయాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆకాంక్షించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు విజయదశమి శుభాకాంక్షలను శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. చెడుకు దూరంగా, మంచిగా దగ్గరగా జీవించాలని విజయదశమి సూచిస్తోందన్నారు. యువత విజయదశమి పండగ ప్రాశస్త్యాన్ని అర్థం చేసుకుని తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అభిలషించారు.



చెంద్రాయిని కుంట జలాశయంలో నీరు

నీరు వృథా..రైతుల వ్యథ..!

ఆయకట్టు భూములు సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో నిర్మించిన చెంద్రాయిని కుంట (జలాశయం)నీరు పంట పొలాలకు అందకుండా వృథాగా బయటకు వెళ్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో కొన్నేళ్లుగా సాగునీరు ఆయకట్టు భూములకు అందడం లేదు. నీరున్నా రైతులకు ఉపయోగ పడని పరిస్థితి నెలకొంది. తూముల మరమ్మతులపై అధికారులు , ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించకపోవడంతో నీరు వృథాగా బయటకు వెళ్తోంది.

తూము సరిగా లేకపోవడంతో వృథాగా బయటకు పోతున్న నీరు

- ◆ చెంద్రాయినికుంట ఆయకట్టు కాలువ శిథిలం
- ◆ తూము నుంచి వృథాగా పోతున్న నీరు
- ◆ 7 వేల ఎకరాలకు అందని సాగునీరు

ప్రజాశక్తి-గుత్తి
గుత్తి మండలం చెర్లోపల్లి పంచాయతీ పరిధిలో 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 70 ఎంసిఎఫ్‌టి సామర్థ్యంతో చెంద్రాయిని కుంట జలాశయంను నిర్మించింది. కొంత కాలానికి ఆ జలాశయానికి హంద్రీనీవా ద్వారా కృష్ణ జలాలను గుత్తి ఉప కాలువ ద్వారా మళ్లించారు. చెంద్రాయిని కుంట కింద దాదాపు 7 వేల ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. గుత్తి మండలంలోని చెర్లోపల్లి, బ్రాహ్మణపల్లి, పూలకుంట,పెద్దొడ్డి, అనగాని దొడ్డి, అబ్బేదొడ్డి, పామిడి మండలంలోని అయ్యవారిపల్లి, గుంతకల్లు మండలంలోని గుర్రబ్బాడుతోపాటు సమీప గ్రామాల పరిధిలో ఉన్న ఆయకట్టు భూములకు కాలువ ద్వారా సాగునీరు సరఫరా అయ్యేది. మూడేళ్ల క్రితం కొందరు స్వార్థంతో లిఫ్ట్ (తూము)ను ధ్వంసం చేశారు. దీంతో చెంద్రాయిని కుంటకు వస్తున్న నీరు లిఫ్ట్ లీకేజీతో వృథాగా వెళ్తోంది. జలాశయానికి సంబంధించిన కట్ట కూడా బలహీనంగా ఉంది. కట్టపై ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పూడికతీత పనులు కూడా చేపట్టడం లేదు. ఆయకట్టు కాలువ శిథిలావస్థకు చేరుకుంది. కాలువలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. జలాశయం పూర్తిస్థాయిలో నిండి ఆయకట్టుకు సాగునీరు వదిలితే ఆ నీరు కాలువలో ఎక్కడకక్కడే నిలిచిపోయే పరిస్థితి ఉంది. ఎన్నో ఏళ్లుగా చెంద్రాయినికుంట, ఆయకట్టు కాలువ, గుత్తి ఉప కాలువ అధునీకరణ పనులకు నిధులు మంజూరు కావడం లేదు. కాలువలు ఆధునికరణ పనులు జరిగితే సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జలాశయం తూమును పూర్తి స్థాయిలో మరమ్మతు చేసి, సాగు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



చెంద్రాయిని కుంట జలాశయం కింద ఉన్న ఆయకట్టు

ఆయకట్టుకు నీరిస్తాం

చెంద్రాయినికుంటని పూర్తిస్థాయిలో నీటితో నింపే అవకాశం ఉంది. తూము వద్ద వరిగడ్డితో పూడ్చి వేసి నీరు వథా కాకుండా చేస్తాం. 7వేల ఎకరాల ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేస్తాం. తాగునీరు సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతాం.

ఎం.వెంకటరమణ,
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్.

కేంద్రం ప్యాకేజీ కంటే మద్యం ఆదాయమే ఎక్కువ..!

- ◆ఉమ్మడి జిల్లాలో 4421 దరఖాస్తులు
- ◆మద్యం టెండర్ ఆదాయం రూ.88.41 కోట్లు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన ప్రాంతాలకు ఇచ్చిన ప్యాకేజీ కంటే మద్యం టెండర్ దరఖాస్తుల ద్వారా వచ్చిన ఆదాయమెక్కువగా ఉండటం గమనార్హం. రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన ప్రాంతాల ప్యాకేజీ కింద కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.50 కోట్లు ఇచ్చింది. దానికంటే ఈ ఏడాది నిర్వహించిన మద్యం టెండర్ ఆదాయం ఎక్కువగా ఉండటం గమనార్హం. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకొచ్చిన కొత్త విధానంతో మద్యం దుకాణాల నిర్వహణ ప్రయివేటుకు ఇచ్చారు. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించారు. అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచారు. సత్యసాయి జిల్లాలో 87 మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచారు. ఇందులో అనంతపురం జిల్లాలో 136 దుకాణాలకు 3022 దరఖాస్తులొచ్చాయి. దీనికి ఒక్కో షాపుకు రెండు లక్షల చొప్పున రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన 3022 దరఖాస్తులకు చెల్లించిన మొత్తం రూ.60.4 కోట్లు. సత్యసాయి జిల్లాలో 87 దుకాణాలకు 1399 దరఖాస్తులు అందాయి. దీనికి రూ.27.98 కోట్లు ఆదాయం సమకూరనుంది. మొత్తం కలిపితే రూ.88.42 కోట్లు ప్రభుత్వానికి రుసుం రూపంలో ఆదాయం సమకూరనుంది.

అనంతలో పోటాపోటీ...తాడిపత్రి నామమాత్రం
అనంతపురం నగరంలో మద్యం దుకాణాలకు టెండర్లు పోటాపోటీగా దాఖలయ్యాయి. 15వ దుకాణానికి అత్యధికంగా 47 దరఖాస్తులందాయి. 45 దుకాణానికి 46 దరఖాస్తులందాయి. నగరంలో కొంత మంది ఏకంగా వంద దరఖాస్తులు కూడా వేశారన్నారు. తాడిపత్రిలో 104, 100, 99 నంబరు దుకాణాలకు రెండు దరఖాస్తులు మాత్రమే పడ్డాయి. ఇవి తాడిపత్రి పట్టణంలో మాత్రమే ఉన్నాయి. మరికొన్ని చోట్ల మూడు దరఖాస్తులు వేశారు. మరికొన్ని చోట్ల తొమ్మిది నుంచి 30కిపైగా దరఖాస్తులు పడ్డాయి.

అధికారపార్టీ కనుసన్నల్లోనే
మద్యం దుకాణాల టెండర్లను దక్కించుకునేందుకు అధికారపార్టీ నేతలు పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. ప్రధానంగా ప్రజాప్రతినిధుల అనుయాయులే దక్కించుకునే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. కొన్ని చోట్ల అధికారపార్టీ నేతలే పోటీలు పడటం కనిపించింది. ఈనెల 16వ తేదీన మద్యం టెండర్లను నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురం నగరంలోని జెఎన్‌టియు ఆడిటోరియంలో లక్కీ డ్రా తీయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను చేపట్టే పనిలో ఎక్సైజ్ శాఖ నిమగ్నమైంది.

తాగునీటి సరఫరా కార్మికులతో చర్చలు సఫలం


వేతనాలు, పిఎఫ్, ఇతర సమస్యల పరిష్కారానికి అంగీకారం - సమ్మె విరమణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్
నీలకంఠాపురం, శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా కార్మికులతో జిల్లా అధికార యంత్రాంగం నిర్వహించిన చర్చలు సఫలం అయ్యాయి. బకాయి వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని కోరుతూ సెప్టెంబర్ 29వ తేదీ నుంచి కార్మికులు సమ్మె చేపట్టిన నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. గురువారం నాడు సిఐటియు నాయకులు, కార్మికులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చలు నిర్వహించారు. చర్చల్లో భాగంగా తక్షణమే వేతనాలు చెల్లింపునకు ఆయా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఏ కాంట్రాక్టర్ ఏ నెల వేతనాలు చెల్లించాలి, పిఎఫ్, ఈఎస్ఐ బకాయిలు ఎలా చెల్లిస్తారు.... అన్న విషయాలపై అధికారులు కాంట్రాక్టర్లు కార్మిక సంఘాల నాయకులతో ఒప్పంద హామీ పత్రాన్ని రాసి ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ కాంట్రాక్టర్, ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ సంస్థ కాంట్రాక్టర్‌లు సంతకాలు చేసి ఒప్పంద పత్రాన్ని కార్మికులకు అందజేశారు. ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థకు సంబంధించి వేతన బకాయిలు పిఎఫ్‌లు అక్టోబర్ 15వ తేదీ లోపు రెండు నెలల వేత్తనాలు, 30వ తేదీలోపు మూడు నెలల వేతనాలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. వీటితో పాటు మరికొన్ని డిమాండ్లను కార్మికులు అధికారులు ముందు ఉంచారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం కార్మికులకు 2023 డిసెంబర్ నెల జీతాలు, పిఎఫ్ కాంట్రాక్టర్ వై.శివారెడ్డి అక్టోబర్ 30వ తేదీ లోపు చెల్లించాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ కలాం నాయుడు కళ్యాణదుర్గం రాయదుర్గం కార్మికులకు 2022 సంవత్సరంలో నాలుగు నెలలా 20 రోజుల పిఎఫ్ చెల్లించాల్సి ఉంది. ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సంస్థ కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డి 2024 జూన్ నుంచి సెప్టెంబర్ నెల వరకు నాలుగు నెలల వేతనాలు రూ.17200, పిఎఫ్ తో కలిపి ప్రతి కార్మికునికీ అక్టోబర్ 2024 15వ తేదీలోపు రెండు నెలల జీతాలు, అక్టోబర్ 2024, 30వ తేదీలోపు రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. 2024 సంవత్సరం ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు డిఫరెన్స్ అమౌంట్ వెయ్యి రూపాయలు చొప్పున ప్రతి కార్మికునికీ చెల్లించాలి. ఆరు నెలల పిఎఫ్ బకాయలు కట్టని కార్మికులందరికీ 30వ తేదీలోపు చెల్లించాలి. 21 మంది కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి. మిగతా కార్మికులు రెండు నెలల వేతనాలు 15వ తేదీ లోపు చెల్లించాలి. ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ సంస్థ శివశంకర్ రెడ్డి కాంట్రాక్ట్‌ను 2024 సంవత్సరం వరకు రద్దు చేయాలి. కార్మికులపై కక్ష సాధింపులు ఉండరాదు. ఈ డిమాండ్ల అన్నింటినీ పరిష్కరించేలా అధికారుల సమక్షంలో కాంట్రాక్టర్లు ఒప్పంద హామీ పత్రాన్ని రాసి అందజేశారు. దీంతో కార్మికులు సమ్మె విరమించి విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి, ప్రజా ప్రతినిధులు, సిపిఎం, సిపిఐ, రైతు కార్మిక సంఘాల నాయకులకు కతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

హైకోర్టు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.రంగారెడ్డి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్
పెనుకొండ ప్రాంతం అభివృద్ధి, పెనుకొండ బార్ అసోసియేషన్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎపి హైకోర్టు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, న్యాయవాది ఎన్.రంగారెడ్డి తెలిపారు. రొద్దం నివాసి ఎన్.నాగిరెడ్డి కుమారుడైన ఎన్.రంగారెడ్డి ఇటీవల ఎపి హైకోర్టు బార్ అసోసి యేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. దీంతో శుక్రవారం పట్టణంలో పెనుకొండ బార్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎన్.రంగారెడ్డి మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో నైపుణ్యంతో పాటు ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో న్యాయవాదులు ముందుకెళ్లాలని సూచించారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడానికి శ్రామికుడిలా కృషి చేస్తానని మాటిచ్చారు. బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఎన్.రంగారెడ్డి తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదు ర్కొని ఎపి హైకోర్టులో న్యాయవాద వృత్తిని సాగించి బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక వ్వడం పెనుకొండ బార్ అసోసియేషన్‌కు ఎంతో గర్వకారణం అన్నారు. రంగారెడ్డి ఎదుగుదలను ప్రశంసించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎజిపి ఎం.భాస్కర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.మదనమోహన్‌రెడ్డి, న్యాయవాదులు ఆర్.శ్రీకాంత్‌రెడ్డి, డివి.శివారెడ్డి, సిఆర్.నాగార్జున, టి.చంద్ర శేఖర్‌రెడ్డి, వై.లక్ష్మీనారాయణ, కె.గుండాచారి, ఎండి.ఆసిఫ్, జి.సుదర్శన్‌రెడ్డి, వైసి.అశ్వర్థ నారాయణ, బి.శ్రీరాములు, వి.సుబ్రహ్మణ్యం, న్యాయవాద సహాయకుల సంఘం అధ్యక్షులు బలూల్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.




న్యాయవాది ఎన్.రంగారెడ్డిని సన్మానిస్తున్న పెనుకొండ బార్ అసోసియేషన్ సభ్యులు

వైసిపి పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షుల నియామకం

సోమందేపల్లి : వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ సోమందేపల్లికి చెందిన గోవిందమ్మ గారి శ్రీనివాసులును వైసిపి టౌన్ అధ్యక్షులుగా, గట్ట మంజును ఉపాధ్యక్షులుగా నియమించినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ గజేంద్ర తెలిపారు. దీంతో మాజీ సర్పంచ్ రమాకాంత్ రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లోని వైఎస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన అధినేత జగన్, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

బాధితులకు 'గుండుమల' పరామర్శ

మడకశిర : మండలంలోని గుండుమల గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో గాయపడిన బాధితురాలిని అన్ని విధాలా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి భరోసా ఇచ్చారు. గుండుమల తిప్పేస్వామి వ్యక్తిగత డ్రైవర్ మంజునాథ్ కుమార్తె ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడింది. విషయం తెలిసిన వెంటనే గుండుమల మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. అలాగే మండలంలోని చందకచర్ల పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు కిష్టప్ప భార్య సుశీలమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా గుండుమల తిప్పేస్వామి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడిన వారందరినీ ఆదుకోవడానికి టిడిపి సిద్ధంగా ఉందన్నారు. ఆయన వెంట నాయకులు నరసింహారెడ్డి, వెంకటాద్రి, కార్యకర్తలు ఉన్నారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న గుండుమల తిప్పేస్వామి

'ఉపాధి' బకాయిబిల్లులు త్వరలో విడుదల

ప్రజాశక్తి-మడకశిర
2018-19 ఉపాధి హామీ మెటీరియల్ కంపోనెంట్ బిల్లులు త్వరలో విడుదలవుతాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గత ప్రభుత్వం ఆపేసిన బిల్లులను త్వరలో విడుదల చేయనున్నట్టు ఆ శాఖ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. ఈ విషయమై ఈ నెల 8వ తేదీ ఉపాధి హామీ కౌన్సిల్ మాజీ సభ్యులు డాక్టర్ డి.శ్రీనివాస్ మూర్తి, గురుమూర్తి, లక్ష్మీసుభాషిని, పీరయ్య తదితరులు సిఆర్‌డి కమిషనర్ కృష్ణతేజని విజయవాడలో కలిసి నిధులను సత్వరమే విడుదల చేయాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే నిధులు విడుదల చేస్తామని తెలిపారని డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మడకశిర
నగర పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని 17వ వార్డు కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర కొనియాడారు. విజయదశమి సందర్భంగా శుక్రవారం కౌన్సిలర్ 40 మంది పారిశుధ్య కార్మికులకు ఉచితంగా దుస్తులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు మరిచిపోలేమన్నారు. అప్పటినుంచి వారి సేవలను గుర్తు చేస్తూ ఏటా విజయదశమి సందర్భంగా కార్మికులకు దుస్తులు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు ఫిట్టర్ రామాంజి, బాలు, శనివారప్ప, పెద్ద కిష్టప్ప, మూర్తి, రమణ, రామంజి, పర్వతమ్మ, పెద్దక్క, ఎల్లమ్మ, శివమ్మ, అన్నపూర్ణమ్మ, అన్నమ్మ పాల్గొన్నారు.

కార్డుదారులందరికీ కందిపప్పు పంపిణీ చేయాలి
మడకశిర పట్టణంలోని రేషన్‌కార్డుదారులందరికీ కందిపప్పు పంపిణీ చేయాలని 17వ వార్డు కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి రేషన్‌కార్డుదారునికి విజయదశమి సందర్భంగా బియ్యం తో పాటు కందిపప్పు, చక్కెర పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు రేషన్ డీలర్లు వారికి కావాల్సిన కార్డుదారులకు మాత్రమే కందిపప్పు, చక్కెర పంపిణీ చేయడం తగదన్నారు. అలాంటి డీలర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.



కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర

పారిశుధ్య కార్మికులకు పండుగ కానుకలు

సోమందేపల్లి : సోమందేపల్లి మేజర్ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు శుక్రవారం సర్పంచి గంగాదేవి, టిడిపి హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దసరా పండగ కానుకలు పంపిణీ చేశారు. సర్పంచి గంగాదేవి దుస్తులు, చెప్పులు, నూనె, తదితర సరుకులతో పాటు కొంత నగదు బోనస్ అందజేయగా, టిడిపి నాయకులు దుస్తులు, స్వీట్ బాక్స్ అందజేశారు. కార్యక్రమంలో గుమస్తా జయరాం, నాయకులు సూర్యనారాయణ, వడ్డే సూరి, కిష్టప్ప, నిమ్మకాయల రామాంజి, ఆకుల రమణ, జనసేన నాయకురాలు శిరీష, పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న డీఎస్పీ

సోమందేపల్లి : గ్రామదేవత చౌడేశ్వరిదేవిని శుక్రవారం పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారికి ఆలయ కమిటీ అధ్యక్షులు డీసీ ఈశ్వరయ్య, తొగటవీరక్షత్రియ అధ్యక్షులు సిసి హరిదాస్, సభ్యులు రంగన గోపాల్, గట్టు మహీంద్ర ఆహ్వానం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు డీఎస్పీ దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. అనంతరం డీఎస్పీ ఆలయ పరిసరాలను, ఏర్పాట్లను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌బాబు, సభ్యులు బీరే మారుతి, చింతా నారాయణ, పామిశెట్టి ఈశ్వర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా వర్షాలు


ప్రజాశక్తి -పెనుకొండ టౌన్
పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా శుక్రవారం వర్షాలు కురిసాయి. రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. రొద్దం మండలంలో అత్యధికంగా 66.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా అగళి మండలంలో 6.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. అలాగే అమరాపురం-65.4, రొళ్ల-60.4, గుడిబండ-41.0, హిందూపురం-38.4, చిలమత్తూరు- 32.4, సోమందేపల్లి-30.8, లేపాక్షి-24.6, పరిగి-20.4, పెనుకొండ-18.2, మడకశిర-15.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైనట్లు డివైఎస్ఒ తెలిపారు. డివిజన్‌లో మొత్తం 419.6 మిల్లీ మీటర్ల వర్షపాతం కురవగా సగటున 35 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ పరిహారంలో

'రెవెన్యూ' మాయాజాలం

రూ. 82 లక్షలు మరో రైతు ఖాతాలో జమ

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్
మండలంలోని బూదిలి రెవెన్యూ పొలంలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కోసం చేపట్టిన భూ సేకరణలో భారీ అవినీతి చోటుచేసుకుంది.. అసలైన రైతులకు చెందాల్సిన పరిహారం రెవెన్యూ అధికారుల మాయజాలంతో మరొకరి ఖాతాకు బదిలీ కావడం సంచలనం కలిగిస్తోంది. కొందరు రెవె న్యూ అధికారులు, ప్రయివేటు వ్యక్తులు కుమ్మక్కై రూ. 82,47,000 అవినీతికి పాల్పడినట్లు తెలు స్తోంది. వివరాలు.. మండలంలోని బూదిలి రెవెన్యూ పొలంలో రైతు హరిజన రంగప్పకు సర్వే నెంబరు 960-2లో 0.50 ఎకరాలు, 967-6లో 1.60 ఎకరాల భూమి ఉంది. అందులో సర్వే నెంబర్ 967-6లోని 1.60 ఎకరాల భూమి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కోసం తీసుకున్నారు. అయితే దీనికి సంబంధించి నష్ట పరిహారం రూ. 82,47,000 రైతు హరిజన రంగప్ప ఖాతాలో కాకుండా అదే గ్రామానికి చెందిన చాలా రోజుల క్రితం మృతిచెందిన హరిజన ముత్యాలప్ప ఖాతాలో జమ కావడం గమనార్హం. ఈ విషయం తెలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించు కోలేదని అసలైన రైతు రంగప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. కొందరు రెవెన్యూ అధికారులు ప్రయివేటు వ్యక్తులతో కుమ్మక్కై సదరు రైతుకు చెందిన పరిహారం నగదు పంచుకున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం బాధిత రైతు తహశీల్దార్ మారుతిని కలిసి ఈ భూ కుంభకోణంలో బూదిలి వీఆర్వో కీలక పాత్ర వహించారని ఫిర్యాదు చేశాడు.



తహశీల్దార్ మారుతికి సమస్యను వివరిస్తున్న బాధిత రైతు రంగప్ప

కల్తీ ఫుడ్‌పై కంట్రోల్ ఏదీ..?

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రెస్టారెంట్లు తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అపంతపురం జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో రెస్టారెంట్లు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పలురకాల మాంసాహార ఐటమ్స్‌తో ఆహార ప్రియులను నట్టేట ముంచుతున్నాయి. శ్రీ సత్య సాయి జిల్లాలోని హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండతో సహ మిగిలిన పట్టణాల్లో కల్తీ ఆహారం రాజ్యమేలుతుంది. దీంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది. ఒక్క హిందూపురంలోనే దాదాపు 20 రెస్టారెంట్లు ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 5వేలకు పైగా రెస్టారెంట్లు ఉండగా వీటిలో అనుమతులు ఉండేవి వందల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇకపోతే స్ట్రీట్ ఫుడ్స్ సెంటర్లు, భోజనం, టిఫిన్ హోటళ్లు అధిక సంఖ్యలో ఉన్నప్పటకీ వాటిలో కొన్నింటికి మాత్రమే అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరందరు పురపాలక సంఘంలో ట్రేడ్ లైసెన్స్ తీసుకుని ఇదే అనుమతి అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ రెస్టారెంట్లలో నాణ్యత లేక పోయినప్పటికి అధిక ధరలతో పాటు కనీసం తాగునీరు కూడా ఇవ్వరు. తాగునీటినికొనాల్సిన దుస్థితి ఉంది. రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, భోజన హోటళ్లమితిమీరుతున్నాయి. ఇష్టానుసారంగా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తూ ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. ఆరోజుకు మిగిలిన ఆహారాన్ని ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచి మరుసటి రోజు విక్రయించడం వల్ల ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది.

ఆహార విక్రయాలకు అనుమతులేవీ..?

ప్రస్తుతం మార్కెట్లో ఆహార పదార్థాల బిజినెస్ ఊపందుకుంటుంది. ఇదే అదునుగా భావిస్తున్న పలు రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకులు అనుభవం లేని చెఫ్‌ను పెట్టుకొని ప్రజా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. ఆహార పదార్థాల విక్రయించే హోటళ్లు, రెస్టారెంట్లు, పలు దుకాణాలకు, ఆహార భద్రత అధికారుల నుంచి పలు అనుమతులు పొందాలి. అయితే ఈ అనుమతులకు విరుద్ధంగా కొందరు ఇష్టారాజ్యంగా ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకొని సంపాదనే ధ్యేయంగా నాణ్యతలేని పదార్థాలు విక్రయిస్తూ ప్రజారోగ్యాన్ని పక్కనపెట్టి క్యాష్ చేసుకుంటున్నారు. పట్టణాలతో పాటు రహదారుల్లో దాబాలు, రెస్టారెంట్లు, భోజన హోటళ్లు, టిఫిన్ సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుంటే వీటిపై సంబందిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆహార విక్రయ కేంద్రాలకు నిబంధనలు ఇవే..

ఆహార పదార్థాలు విక్రయించే రెస్టారెంట్లకు, భోజన హోటళ్లకు, దాబాలకు, కర్రీ పాయింట్లకు రిజిస్ట్రేషన్ తో పాటు, ఆహార భద్రత అధికారి జారీ చేసిన లైసెన్స్ ఉండాలి. అధికారులు తమ దాడుల్లో ఆహార విక్రయ కేంద్రాల్లో అనుమతులు లేకపోతే ముందుగా నోటీసులను జారీ చేయాలి. ఆ తర్వాత కూడా అదే తీరు కొనసాగితే ఆ కేంద్రాలను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించాలి. అంతేకాకుండా ఏడాదికొకసారి నిర్ణీత సంఖ్యలో నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపించాలి. జిల్లాలోని ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలలో దీనికి భిన్నంగా కొనసాగుతుంటే అధికారులకు మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



పట్టణంలో ఎలాంటి అనుమతులు లేని ఓ రెస్టారెంట్

ఆహార భద్రత అధికారుల పర్యవేక్షణ కరువు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కల్తీ ఆహారం రాజ్యమేలుతోంది. నిల్వ ఉంచిన ఆహారాలను విక్రయిస్తూ ప్రజారోగ్యంపై దెబ్బతీస్తున్న విక్రయదారులపై అధికారుల చర్యలు శూన్యం అనిపిస్తుంది. కల్తీ ఆహారాలు విక్రయం జరగకుండా తీసుకోవాల్సిన అధికారులే ఏమీ పట్టనట్లు వ్యవహరిచడం వల్ల కల్తీ రాకెట్లు రెచ్చిపోతున్నాయి. ఆహార భద్రత అధికారులు ఒక్కొక్కరు వారి పరిధిలో నిర్ణీత సంఖ్యలో ప్రజలు ఉపయోగించే నిత్యావసరాల్లో వాటి నాణ్యత ప్రమాణాలను తెలుసుకునేందుకు నమూనాలను సేకరించాలి. సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపించి వచ్చిన ఫలితాలు ఆధారంగా విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి. అయితే ఈ తీరు ఆచరణలో మాత్రం శూన్యం అనిపిస్తోంది. తూతూమంత్రపు దాడులతో మమ అనిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతి మండలానికి ఒక ఆహార భద్రత అధికారి ఉండి పర్యవేక్షణ చేస్తే ఫలితాలు ఉంటాయి. అయితే ఉమ్మడి జిల్లాలో మాత్రం సిబ్బంది కొరతతో ఆహార భద్రత అధికారులు ఇబ్బంది పడుతున్నారు. రెండు జిల్లాలకు ఇద్దరు అధికారులు ఉండడం, వీరే నమూనాలు సేకరించి చర్యలు తీసుకోవాల్సి ఉండగా పని భారం ఎక్కువ అవుతోంది.

ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి - బుక్కపట్నం

పంచాయతీ కేంద్రంలో ప్రధాన రహదారులతో పాటు, గోరంట్ల పల్లి రోడ్డు కు ఇరువైపులా లో ఉన్న ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను సర్పంచి నాగలక్ష్మి రాజు ఆధ్వర్యంలో తొలగించారు. జెసిపి సాయంతో వీటిని తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ స్థానిక శివాలయం నుంచి గోరంట్ల పల్లి వెళ్లే రహదారి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగి ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. దీంతో వాటి తొలగింపునకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. గ్రామంలో కూడా స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా వీధులను, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

14 నుంచి పల్లె పండుగ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండలంలోని ఆయా పంచాయతీల్లో 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరామిరెడ్డి శుక్రవారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ తేదీ సామలగొంది, వేపరాల, 15న జీన్లకుంట, గాండ్లపెంట, 16న టి పెద్ద తండా, గుడ్డు వెలగల, 17న మల్ల మీద పల్లి, కటారుపల్లి, 18న సోమయాజులపల్లి, తూపల్లి, 19న తుమ్మలబైలు, మద్ది వారి గొంది, 20న పెద్ద తండా గ్రామాలలో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, జేఈలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బత్తలపల్లి : పల్లె పండుగను విజయవంతం చేద్దామని బత్తలపల్లి ఎంపీడీవో నరసింహనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు కింద గ్రామసభలలో ఆమోదం పొందిన పనులకు భూమి పూజ కార్యక్రమాలను పల్లె పండుగ సందర్భంగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఈ నెల 14న నల్లబోయనపల్లి బీసీ కాలనీలోనూ, డి.చెర్లోపల్లి బీసీ కాలనీలోనూ సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. 15న గరికలపల్లి, 16న మాల్యవంతం, 17న దంపెట్ల, పోట్లమర్రి, 18న ఓబుళాపురం, తంబాపురం,19న సంగాల, అప్పరాచెరువు, 20న ఈదుల ముష్టూరు, సంజీవపురం, బత్తలపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని మౌనిక థియేటర్ ఎదురుగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు శనివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఎంఇఎఫ్, ఎంఆర్‌పిఎస్, ప్రజా సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

101 జీవోను పునరుద్ధరించాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

101 జీవోను వెంటనే పునరుద్ధరించాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల గ్రహీతల సంఘం అధ్యక్షులు, ఎంఇఒ బొల్లె ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో రాష్ట్ర జాతీయ అవార్డుల గ్రహీతల సంఘం ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. 101 జీవోను పునరుద్ధరించి అవార్డు గ్రహీతలకు రాయితీలపై బస్సు, రైల్వే పాసులు, ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో పలు సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయని అలానే మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని అన్నారు. వీటిపై రాష్ట్ర, జిల్లా, విద్యాశాఖకు వినతి పత్రాలు అందజేయడంతో పాటు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో అనంతపురం జిల్లా సంఘం ప్రతినిధి ఎంనారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు అబ్దుల్ రహిమాన్, ఎం జగదీష్, శంకర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వర్షసూచన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాబోయే మూడు రోజులలో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎగువ వాయు తుఫాను ప్రసరణ దక్షిణ బంగాళాఖాతం యొక్క మధ్య భాగాలపై ఉందని, సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని అన్నారు. దీని ప్రభావంతో ఈనెల 14 నుంచి 16 వరకు దక్షిణ కోస్తా, రాయలసీమలోని చాలా చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు.

'పెన్నోబిలం' ఆలయంలో అవినీతిని అరికట్టాలి

ఉరవకొండ : నియోజకవర్గంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నోబిలంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోటు చేసుకుంటున్న అవినీతిని అరికట్టాలని ఎరుకల సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత మేనెలలో జరిగిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చలువ పందిళ్ల ఏర్పాటు టెండర్‌ను అనంతపురానికి చెందిన గౌతమ్‌రెడ్డి ఆలయ అధికారులతో కుమ్మక్కై తక్కువ టెండర్‌కు దక్కించుకున్నాడన్నారు. అడ్డదారిలో టెండర్ పొందిన గౌతమ్‌రెడ్డి పనులు చేయకుండా తనకు సబ్ లీజు ఇచ్చాడని వాపోయాడు. తాను పనులు పూర్తి చేసినా గౌతమ్‌రెడ్డి బిల్లులు చెల్లించకుండా జాప్యం చేయడంతోపాటు తనని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని ఆలయంలో జరుగుతున్న టెండర్ల అవకతవకలను విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తనచేత పనులు చేయించుకుని, బిల్లులు ఇవ్వకుండా మోసం చేసిన గౌతమ్‌రెడ్డి నుంచి తనకు డబ్బులు ఇప్పించాలని కోరారు.


ట్రోఫీతో రాష్ట్రస్థాయి పోటీల విజేత జట్టు

రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ ఛాంపియన్‌గా సత్యసాయి జిల్లా జట్టు

ప్రజాశక్తి-హిందూపురం

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్ బాల్ పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో భాగంగా ఫైనల్లో కర్నూలు జట్టుతో సత్యసాయి జిల్లా జట్టు తలపడగా ఆట ముగిసే సమయానికి సత్యసాయి జిల్లా జట్టు కర్నూలు జట్టుకన్నా ఒక గోల్ అదనంగా చేసి చాంపియన్‌గా నిలిచి కప్ కైవశం చేసుకొందని జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు జెవి. అనిల్ కుమార్ తెలిపారు. జట్టు కోచ్‌గా బీకే మహమ్మద్ సలీమ్, మేనేజర్ కె.ఇర్షాద్ అలీ వ్యవహరించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్టు సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు.

మద్యందుకాణాలకు 580 దరఖాస్తులు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ప్రయివేటు మద్యం దుకాణాల దరఖాస్తుకు శుక్రవారంతో తెరపడింది. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి ఈ నెల ఒకటో తేదీ నుంచి మద్యం దుకాణాల లైసెన్సులకు దరఖాస్తులు ఆహ్వానించింది. దరఖాస్తుకు చివరి తేదీ బుధవారాం కాగా రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు రోజులు పొడిగించి మద్యం దుకాణ దరఖాస్తులను శుక్రవారం వరకు స్వీకరించింది. జిల్లాలో 8 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 87 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 580 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం.

కాసులు కురిపిస్తున్న 'కనకాంబరాలు'


హిందూపురంలోని పూటమార్కెట్

ప్రజాశక్తి-హిందూపురం

దసరా పండుగ వేళ కనకంబరాల పూలు రైతులకు కనక వర్షం కురిపిస్తున్నాయి. శుక్రవారం హిందూపురం పూల మార్కెట్ లో ఏకంగా ఒక కేజీ పూలు రూ. 2వేల ధర పలికింది. దీంతో కనకంబరాల పూల రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే బాటలోనే మల్లెపూల ధర సైతం ఏకంగా రూ.వెయ్యి దాటింది. ఎన్నడు లేని విధంగా పూల ధరలు ఆమాంతంగా పెరగడంతో పూల కొనుగోలు వచ్చిన వారు ధరలు చూసి ఆశ్చర్యపోతున్నారు.

దసరా పండగంటే నవరాత్రులతో కలిపి పది రోజులు పండుగ. ఈ పండుగ సందర్భంగా దుర్గా మాత 9 రోజుల పాటు వివిధ వేషాలలో భక్తులకు దర్శనం ఇస్తుంది. ఆలయాలకు వెళ్లేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ఆలయాలకు వెళ్లేవారు తప్పకుండా పూలు తీసుకుని వెళతారు. హిందూపురం పూల మార్కెట్‌లో శరన్నవరాత్రి పండుగ సందర్భంగా పూలను కొనేందుకు మార్కెట్‌కు వచ్చిన కొనుగోలుదారులు పూల ధరలను చూసి ఆశ్చర్యపోతున్నారు. గత రెండు నెలలుగా కురిసిన వర్షాలకు కనకాంబరం పూల దిగుబడి తగ్గి, మార్కెట్‌కు తక్కువగా వచ్చాయి. దీంతో వాటి ధర కిలో రూ.1500 నుంచి రూ.2వేలకు పలికింది. మల్లెపూలు రూ.వెయ్యి నుంచి రూ.1,200దాకా పలుకుతున్నాయి. బంతిపూలు కిలో రూ.80 నుంచి రూ.120 ఉండగా.. చామంతి రూ.200 నుంచి రూ.300దాకా ఉన్నాయి. ఈ ప్రాంతంలో చెండుపూలు సాగుచేసిన రైతులు అధికశాతం తెలంగాణ ప్రాంతానికి తరలించారు. బతుకమ్మ, నవరాత్రి సందర్భంగా హైదరాబాద్ ప్రాంతంలో పూలకు గిరాకీ ఉంటుందని రైతులు అక్కడికి ఎగుమతి చేశారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ధరలు ఎక్కువ అయినప్పటికీ ప్రజల కూడా మంచి వ్యాపారం చేస్తున్నారని వ్యాపారస్తులు అంటున్నారు. ఏది ఎమైనప్పటికి దసరా సందర్భంగా పూల రైతులకు మంచి ధరలు రావడంతో వారు సంతోషంగా ఉన్నారు.

రూ. లక్షలు ఖర్చుపెట్టారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు..!


అంగన్వాడీ కేంద్రం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు


సెంటర్ వద్ద పడి ఉన్న కర్నాటక మద్యం ప్యాకెట్లు

ప్రజాశక్తి - చిలమత్తూరు

నాడు-నేడు పేరిట గత ప్రభుత్వం విడుదల చేసిన సొమ్మును కొన్ని పాఠశాలలు వృథా చేశాయి. అలాంటి పాఠశాలల్లో మండలంలోని సోమగట్ట పాఠశాల ఒక్కటి. నూతన విద్యావిధానంలో మార్పులకు అనుగుణంగా సోమగట్ట ఎంపిపి పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాన్ని మెర్జ్ చేస్తూ కో లొకేటెడ్ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు నాడునేడు కింద సుమారు 5 లక్షల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. అందులో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ జాయింట్ ఖాతాలో 2,30,117 రూపాయలు జమ చేసింది. ఇందులో 1,65074 రూపాయలు ఖర్చు చేశారు. ఈ డబ్బును అప్పటికే పాఠశాలలో ఉన్న గదికి మరమ్మతులు చేయడానికి, స్కూల్ ముందు పాత్ వే ఏర్పాటు చేయడానికి ఉపయోగించారు. అయితే ఆ గదిని ఉపయోగంలోకి తీసుకురాలేదు. దీంతో ఆ గదిని మందుబాబులు అడ్డాగా చేసుకున్నారు. చుట్టూ కలుపుమొక్కలు పెరిగి పాడుబడ్డ భవనంలాగా దర్శనం ఇస్తుంది. ఇందులో ప్రభుత్వం నుండి వచ్చిన విద్యార్థుల చేర్లు, ఆటవస్తువులు,టేబుల్ మొదలగునవి ఉన్నాయి. వాటికి ఆకతాయిలు దొంగలించిన లేదా విరగొట్టినా దిక్కులేదు. గదిన ఉపయోగంలోకి తీసుకురావడంలో విద్యాశాఖ అధికారులు విఫలం అయ్యారు. పని చేయాలా, పైఅధికారులకు ప్రోగ్రెస్ చూపించుకోవాలా అని పోటీపడే అధికారులు గదిని వాడుకలోకి తీసుకురావడంలో మాత్రం పూర్తిగా విఫలం అయ్యారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి విద్యాశాఖ అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన గదిని వాడుకలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్




నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

అమడగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన మహిళ హత్య కేసుకు సంబంధించి నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వెల్లడించారు. అమడగూరు మండలం మహమ్మదాబాద్ గ్రామ సమీపంలో ఎఎస్ఐ కృష్ణమూర్తికి చెందిన తోటలో కూలీగా పనిచేస్తున్న పెనుగొండ పట్టణానికి చెందిన బోయ రామలక్ష్మిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదుతో నల్లమాడ సర్కిల్ ఇంచార్జ్ పుట్టపర్తి టౌన్ ఇన్స్‌పెక్టర్ సునీత, అమడుగూరు ఎస్ఐ వెంకటనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు. ఓబుల దేవర చెరువు మండలం వేమారెడ్డి పల్లి గ్రామానికి చెందిన సంజీవప్ప కుమారుడు డి. ఆంజనేయులు ఎఎస్ఐ కృష్ణమూర్తికి చెందిన మామిడి తోటలో పనిచేస్తూ ఉండేవాడు. అయితే అతని స్థానంలో పెనుగొండ పట్టణానికి చెందిన బోయ రామలక్ష్మి కూలీగా చేరింది. తనను పనిలోని మాన్పించి పనిలో చేరిందని ఆంజనేయులు రామలక్ష్మిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 6న రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో వ్యవసాయానికి ఉపయోగించే పరికరంతో రామలక్ష్మిపై తలపై కొట్టాడు. దీంతో ఆమె మృతిచెందింది. తమకు వచ్చిన పక్కా సమాచారంతో పోలీసులు నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు. ఈ కేసు చేదించిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్..

ప్రజాశక్తి బత్తలపల్లి

వ్యవసాయ పొలం వద్ద నుంచి పశుగ్రాసం తీసుకుని వస్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ లైను తగిలి షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి ట్రాక్టర్ టైర్లు కాలిపోయాయి. ఈ సంఘటన మండలంలోని జ్వాలాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. జ్వాలాపురం గ్రామానికి చెందిన రమేష్, సురేష్ ఇరువురూ అన్నదమ్ములు. వీరు తమ పొలంలోని వేరుశనగ కట్టె(పశుగ్రాసం) ట్రాక్టర్లో వేసుకుని ఇంటికి వస్తున్నారు. అయితే గ్రామంలో నుంచి పొలాలకు వెళ్లే దారిలో తక్కువ ఎత్తులో విద్యుత్ మెయిన్ లైను వైర్లు ఉన్నాయి. ఈ వైర్లు పశుగ్రాసాని తాకడంతో మంటలు వ్యాపించాయి. వెంటనే పశుగ్రాసాన్ని కిందకు తోసివేశారు. అయినప్పటికీ ట్రాక్టర్ ఇంజనుకు ఉన్న నాలుగు టైర్లు కాలిపోయాయి. బ్యాటరీ సైతం కాలిపోయిందన్నారు. వీటి విలువ రూ.60వేలు ఉంటుంది. వైర్లు కిందికి ఉన్నాయని విద్యుత్ అధికారులకు గతంలో ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి వైరును సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


బదిలీ అధికారులను సన్మానిస్తున్న మున్సిపల్ కార్మికులు

బదిలీ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న హరీష్, ప్రతాప్ అనంతపురం కార్పొరేషన్‌కి బదిలీపై వెళుతున్న సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, ఉద్యోగులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్మికుల యూనియన్ నాయకులు బొగ్గు నాగరాజు, అనిల్, చెన్నప్ప, శివా, హరి,శీనా తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై అమ్మవారు

ప్రజాశక్తి - బుక్కపట్నం

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని చిన్నగమ్మ స్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సింహ వాహనంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పుర వీధులలో ఊరేగించారు.

పుట్టపర్తి రూరల్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా ఆయుధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాహనాలకు జిల్లా ఎస్పీ వి.రత్న చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం జిల్లా పోలీసు ఆయుధాగారం, మోటారు ట్రాన్స్‌పోర్టు విభాగాల్లో దుర్గామాత చిత్రపటానికి ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్ దంపతులు, ఏఆర్ డీఎస్పీ విజయ్ కుమార్ , ఎస్బీ సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఆర్ఐ వలి, సిఐ సునీత, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : విజయదశమి పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా దుర్గాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్త చెరువులో షోరూములు, దుకాణదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.కొత్తచెరువమ్మ ఆలయంలో గత 8 రోజులుగా దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

పట్టణ పరిశుభ్రతే ప్రధానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణ పరిశుభ్రతే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో శుపట్టణ పరిశుభ్రతపై తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులు, మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు సంబందిత అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వార్డుల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రోడ్లపై చెత్త కన్పించరాదన్నారు. మురుగు కాలువలు కూడా ఎప్పటికి అప్పుడు శుభ్రం చేయించాలని మురుగు నీరు రోడ్లపైకి రాకుండా చూడాల్సిన బాధ్యత మేస్త్రీలదే నని తెలిపారు. ప్రభుత్వం కూడా పరిశుభ్రత పట్ల పలు కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శాంసన్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటా..

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకు అండగా ఉంటానని లేపాక్షి ఆలయ చైర్మన్ కరణం రమానందన్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని శుక్రవారం ఆలయ చైర్మన్ కరణం రవ నందన్ లేపాక్షి దుర్గా వీరభద్ర స్వామి ఆలయ ఆవరణంలో జర్నలిస్టులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అంతకు ముందు హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు జర్నలిస్టులతో కలిసి లేపాక్షి దుర్గా వీరభద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దసరా పండుగ సందర్భంగా జర్నలిస్టులందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఇటీవల రాష్ట్ర స్థాయిలో బొమ్మరెడ్డి అవార్డును అందుకున్న ప్రజాశక్తి రిపోర్టర్ షబ్బీర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామాంజినేయులు, గోవర్దన్, గంగరాజుతో పాటు నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు పాల్గొన్నారు.


విలేకరులకు దసరా కానుకలు అందజేస్తున్న ఆలయ ఛైర్మన్